epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 37 | గురువారం | 23.05.2024



## శ్రీవారి సన్నిధిలో మన సీఎం..

- మనవడి పుట్టు వెంట్రుకలు సమర్పించిన రేవంత్‌రెడ్డి
- తిరుమలలో ఇక తెలంగాణ భవనాలు
- ఏపీ కొత్త సీఎం ఎన్నికైన వచ్చి కలుస్తా..
- రెండు రాష్ట్రాల అభివృద్ధికి కలిసి పనిచేద్దామని పిలుపు

**మన చౌరాస్తా, హైదరాబాద్ :** తెలంగాణ నుంచి వచ్చే భక్తుల కోసం తిరుమలలో ప్రభుత్వం తరపున సత్రం, కళ్యాణ మండపం నిర్మిస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తిరుమల శ్రీవారిని సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఏపీలో ఏర్పడబోయే నూతన ప్రభుత్వ సహకారంతో ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి సాధించేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎంను కలుస్తానని, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సకాలంలో వర్షా లు కురిసి.. కరువు పరిస్థితులు తొలగిపోవాలని శ్రీవారిని కోరుకున్నానని తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, ఆయన తిరుమల దర్శనానికి రావడం ఇదే తొలిసారి. తన కుటుంబంతో కలిసి సీఎం రేవంత్ మొక్కు తీర్చుకున్నారు. కొండపై మనవడి పుట్టు వెంట్రుకలు తీశారు. అంతకుముందు రేవంత్ రెడ్డికి శ్రీవారి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.



## పేదలు సన్నబియ్యం తినడం ఇష్టం లేదా!

- ప్రజలు ఓడించినా 'కారు' కూతలు మానడం లేదు
- ప్రతీ గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు
- రాష్ట్ర పంచాయితీ రాజ్ మంత్రి సీతక్క

2 లో

## జనగామ పేరు మార్పు.. మేము ఒప్పుకోం..

- జిల్లా జేఏసీ నాయకుల ఆందోళన
- సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీ దహనం

3 లో





## ఎమ్మెల్సీ ఎన్నికలకు అంతా రెడీ

4

- జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా



## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

2

- జిల్లా పౌరసరఫరాల అధికారి రోజారాణి



## నిరుద్యోగులను మోసం చేస్తున్నరు

3

- మాజీ మంత్రి ఈటల రాజేందర్

General News

## పేదలు సన్నబియ్యం తినడం

# బీఆర్ఎస్ కు ఇష్టం లేదా?

- ప్రజలు ఓడించినా కారు కూతలు మానడం లేదు
- ప్రతీ గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు
- రాష్ట్ర పంచాయితీ రాజ్ మంత్రి సీతక్క



**ములుగు, మన చౌరాస్తా :** గతంతో పోలిస్తే ముందస్తుగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ఐకేపీ సెంటర్లు పెంచి సులువుగా రైతులు అమ్ముకునేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బుధవారం ఆమె ములుగులో మాట్లాడారు. గత ఏడాదితో పోలిస్తే నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోల్లు చేశామన్నారు. ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు జిల్లాకొక ఐఏఎస్ ను నియమించి ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారు. తరుగు, తాలు పేరుతో కోతలు లేవన్నారు. గతంలో ప్రతి క్వింటాకు 7 నుంచి 10 కేజీల వరకు తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ ఉండేదన్నారు. ప్రతి కింటాపై రైతుకు రూ.150 నుంచి రూ.200 వరకు అదనపు లబ్ధి చేకూరేలా పకడ్బందీగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతులు పంట అమ్ముకున్న ఐదు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు వస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఫసల్ బీమా యోజన లేదన్నారు. కనీసం పంట నష్టపరిహారం వచ్చేది కాదన్నారు. రైతాంగానికి పంట నష్టపరిహారాన్ని కాంగ్రెస్ పార్టీ అందిస్తోందని, తడిచిన ధాన్యాన్ని సైతం కొంటుందననారు. తెలంగాణలో సన్న వడ్ల సాగును పెంచేందుకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో సన్న బియ్యం పేరుతోటి దొడ్డు వడ్లనే పాలిష్ చేసి అంగన్వాడీలకు, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించేవారన్నారు. అలా కాకుండా పేదలు కూడా పెద్దోళ్లు తినే సన్న బియ్యం తినాలనే సంకల్పంతో రేషన్ దుకాణాల్లో కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని పెట్టుకుందన్నారు. మనమే మనకు అవసరమైనంత సన్న వడ్లను ఉత్పత్తి చేసుకునేందుకు ఈ బోనస్ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. నాట్లేసుకునే సమయం దగ్గర పడుతుందని, యుద్ధ ప్రాతిపదికన ఈ స్కీమును ప్రవేశపెట్టామన్నారు. భవిష్యత్తులో దొడ్డు వడ్లకు కూడా ఈ స్కీములు వర్తింప చేస్తామన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని 2020లో కేసీఆర్ ప్రకటించి మూడేళ్లు అధికారంలో ఉన్న నయా పైసా బోనస్ ఇయ్యలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ గారితో పాటు కాంగ్రెస్ బ్లాక్,మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

**జనగామ, మన చౌరాస్తా :** ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఆంజనేయరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మొదటి సంవత్సరం విద్యార్థులు 2384 మంది హాజరవుతుండగా జనరల్ 1879 మంది, ఒకేషనల్ కోర్సు కింద 505 మంది ఉన్నట్లు తెలియజేశారు. వీరికి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండవ సంవత్సరం విద్యార్థులు 1606 మంది హాజరవుతుండగా జనరల్ 1230మంది, వృత్తి విద్య కోర్సుల కింద 376 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 11 కేంద్రాలలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు జరగనున్నాయన్నారు. గవర్నమెంట్ జూనియర్ కాలేజీలలో 6 పరీక్ష కేంద్రాలు, సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో 3 పరీక్ష కేంద్రాలు, ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రాక్టికల్స్ జూన్ 4 నుండి 8 వరకు జనగామ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కొనుగోళ్లను వేగవంతం చేయండి

- జిల్లా పౌరసరఫరాల అధికారి రోజా రాణి

**జనగామ, మన చౌరాస్తా :** ధాన్యంకొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి రోజా రాణి అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు జిల్లాలోని బచ్చన్నపేట మండలంలోని నాగిరెడ్డిపల్లి, గంగాపురం, చిన్నరాంచర్ల, కేసిరెడ్డిపల్లి పీపీసీలు, నర్మెట మండలంలోని వెల్దండ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం, రఘునాథపల్లి మండలంలోని అశ్వారావుపల్లి, వెల్ది ఐకేపీ కొనుగోలు కేంద్రాలు, చిల్పూరు మండలంలోని నష్కల్ పీఏసీఎస్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ధాన్యం బస్తాలను లారీల్లో వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం తగదన్నారు. ఓపీఎంఎస్ లో కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం బచ్చన్నపేట మండలంలోని ధాన్యలక్ష్మి రైస్ మిల్, నర్మెట మండలంలోని శ్రేష్ఠ రైస్ మిల్, రఘునాథపల్లి మండలంలోని శ్రీనివాస రైస్ మిల్, కంచనపల్లిలోని జేఎంజే, రాజరాజేశ్వరి, నిడిగొండలోని మహాలక్ష్మి రైస్ మిల్లులను పరిశీలించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి తరలించే సీఎంఆర్ బియ్యం రోజూవారీ లక్ష్యాలను వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మొగులప్ప, డీఎంసీఎస్ ప్రసాద్, డీటీ సీఎస్ శ్రీనివాస్, దేవా తదితరులు పాల్గొన్నారు.





## అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన

**జనగామ, మన చౌరాస్తా:** జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్ బుధవారంజిల్లాలోని పాలకుర్తి మండలంలోని కేజీబీవీ, ఎన్టీఆర్ నగర్ ఎంపీపీఎస్, లింగాల ఘనపురం మండలంలోని నవాబుపేట, పటేల్ గూడెం ఎంపీపీఎస్ లు, కొడకండ్ల మండలంలోని నీలిబండ తండా ఎంపీపీఎస్ పాఠశాలలను సందర్శించి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీటి సంపులు, మరుగుదొడ్లను పర్యవేక్షించి, తగిన సూచనలు చేశారు. అలాగే వాష్ ఏరియాలోని ట్యాప్ లను సరైన విధంగా అమర్చాలని సిబ్బందిని ఆదేశించారు. తరగతి గదుల్లోని ఫ్యాన్ లు, లైట్ లు, తదితర మౌలిక వసతులపై ఆరా తీశారు. ఎటువంటి అలసత్వం తగదని, ఏఏపీసీ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాము, డీఆర్డీఓ మొగులప్ప, సంబంధిత మండల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమకళ పై చర్యలేవీ?

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ, హన్మకొండ జిల్లాల షెడ్యుల్ తెగల అభివృద్ధి అధికారి డీటీడబ్ల్యూవో ప్రేమకళపై కొన్ని రోజులుగా అవినీతి ఆరోపణలు వస్తున్నా జిల్లా యంత్రాంగం విచారణ చేపట్టడంలో ఆలస్యం ఎందుకు అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ భిక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సంక్షేమ వసతి గృహంలో వార్డెన్ల కేటాయింపులో అక్రమార్కులు చేశారని అదే విధంగా కొన్ని హాస్టళ్లలో వార్డెన్ల కేటాయింపులో ఒకే వార్డెన్ కి రెండు హాస్టల్ లను ఇచ్చారని అన్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో, వార్డెన్ ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని అన్నారు. గిరిజనుల అభివృద్ధి గాలికి వదిలేశారని మండిపడ్డారు. వెంటనే జిల్లా కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని యెడల ఆందోళన చేస్తాం అని హెచ్చరించారు.

## చిల్పూర్ తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా చిల్పూర్ తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ చిల్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై మీడియా కథనాలు, ప్రకటనలపై ఆర్డీవో, జిల్లా కలెక్టర్ విచారణ జరిపి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. చిల్పూర్ మండల కేంద్రానికి చెందిన బోల్ల రాజకుమార్ భార్య పేర ఉన్న వ్యవసాయ భూమిని భార్య భర్తల మధ్య గొడవను ఆసరాగా చేసుకొని వేరే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయడం నిదర్శనం అన్నారు. రైతులందరినీ ఒకే విధంగా చూడకుండా నిబంధనల పేరుతో నెలల తరబడి ఆఫీస్ చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపించారు. కరెంట్ డీడీల ధ్రువీకరణ, స్కూల్, కాలేజీ పిల్లల సర్టిఫికెట్ల కోసం వెళితే నెలల కొద్ది తిప్పుకొని లంచాలు దండుకుంటున్నారు ఆరోపించారు. చిల్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిని, అక్రమాలను ఆర్డీవో, జిల్లా కలెక్టర్ విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చెపడామని రమేష్ హెచ్చరించారు.

Local News




# జనగామ పేరు మారిస్తే సహించం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పేరు మారిస్తే సహించబోమని జిల్లా జేఏసీనాయకులు హెచ్చరించారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలో జేఏసీ కార్యాలయంలో కన్వీనర్ మంగళంపల్లి రాజు అధ్యక్షతన సమావేశమైన జేఏసీ నాయకులు ఏకగ్రీవంగా జనగామ జిల్లా పేరు మార్పుపై ఒప్పుకోవద్దని తీర్మానించారు. జనగామ చౌరస్తాలో ఆందోళన చేపట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖబడ్దార్ అంటూ నినాదాలు చేస్తూ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. వెంటనే జనగామ జిల్లా పేరు మార్పు నిర్ణయం వెనక్కు తీసుకోవాలని జనగామ జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు గన్ను కార్తీక్, నల్ల రాహుల్, తుంగ కౌశిక్, వెంపటి అజయ్ మాట్లాడుతూ జనగామ పేరు మారుస్తే కాంగ్రెస్ పార్టీని జనగామ నుంచే భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గద్ద సాయి కుమార్, సల్ల మహేష్, మద్దెల కార్తీక్, చిటుకుల అశోక్, ఆఫ్రోజ్, దినేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.



## 31, 1న సీపీఎం శిక్షణ తరగతులు

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** ఈనెల 31, జూన్ 1న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు తెలిపారు. మండలంలోని ఇప్పగూడెంలో బుధవారం మండల కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు హాజరై మాట్లాడారు. సభ్యుల చైతన్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31, జూన్ 1న రెండు రోజుల పాటు మండల కేంద్రంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మునిగెల రమేష్, మండల కమిటీ సభ్యులు గట్ల మల్లారెడ్డి, దైద రాములమ్మ, పొలసు పరమేష్, ఈదునూరు యకయ్య పాల్గొన్నారు.

## తోట ఆగయ్యకు బీఆర్ఎస్ నాయకుల సన్మానం

**జనగామ, మన చౌరాస్తా :** ఎమ్మెల్సీ ఎలక్షన్ల సందర్భంగా ఇన్‌చార్జిగా వచ్చిన సిరిసిల్ల బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను జనగామ పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, ఎండీ. ఫయాజ్, కొలనుపాక శివ, సోషల్ మీడియా ఇనన్‌చార్జి తుంగ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్

- **బీజేపీ నేత ఈటల రాజేందర్**



**జనగామ, మన చౌరాస్తా :** నిరుద్యోగులను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మోసం చేశాయని బీజేపీ నేత ఈటల రాజేందర్ అన్నారు. జనగామలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరచేతిలో బెల్లం పెట్టి మోచేతిని నాకిస్తుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు బీజేపీని గెలిపిస్తామని ప్రజలు డిసైడ్ అయ్యారన్నారు. నిరుద్యోగులకు రూ.3,116 భృతి ఇస్తానని ఐదు పైసల బిల్ల కూడా ఇవ్వకుండా వారి కళ్లలో మట్టి కొట్టారు. రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ సమక్షంలో రూ.4 వేల రూపాయల భృతి ఇస్తానని రేవంత్ రెడ్డి ప్రామిస్ చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు డీఏలు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క డీఏ కూడా ఇవ్వలేదన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పి ఇంతవరకు గుర్తించలేదన్నారు. అంగన్వాడీ టీచర్లకు రూ.18 వేల జీతం ఇస్తామని అమలు చేయలేదన్నారు. న్యాయానికి, ధర్మానికి, ప్రజల మధ్య ఉండే వారి తరపున పోరాడే బీజేపీకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, నాయకులు పిట్టల సత్యం, ఉడుగుల రమేశ్, సౌద రమేశ్, పవన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



## ఎంవీ భాగ్యరెడ్డి వర్మ జయంతి

**జనగామ, మన చౌరాస్తా:** జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఎంవీ భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కె. దయానంద రాణి, సూపరింటెండెంట్ టి. వేదమని, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు రిజర్వేషన్ పెంచాలి



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ పెంచాలి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని బీసీ రాజ్యాధికార సమితి జనగామ జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టడం సరైనది కాదన్నారు. ముందు బీసీ లెక్కలు చెప్పాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డిలో నిర్వహించిన సభలో బీసీ డెకరేషన్ హామీ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్చిపోవద్దని, ఆ మాటకు కట్టుబడి ఉండాలని ఆయన కోరారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు రాజకీయాలకు అతీతంగా పెద్దపీట వేయాలని విజ్ఞప్తి చేశారు.

## అంజన్న గుడిని అభివృద్ధి చేస్తా

**– పాలకుర్తి నాగరాజు**

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** తాటికొండలోని శ్రీవీరాంజనేయ స్వామి (అంజన్న) దేవాలయంను అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని నూతన చైర్మన్ పాలకుర్తి నాగరాజు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండలో హనుమాన్ గురుస్వామి, పాండు స్వామి ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులు పాలకుర్తి నాగరాజు, ప్రధాన కార్యదర్శి నారబోయిన మల్లేశం, కార్యదర్శులు గుమ్ముల కృష్ణమూర్తి, లాల్ రమేష్, కోశాధికారి నీల రమేష్. ప్రచార కార్యదర్శి ఎడమ రమేష్ లతో పాటు బొంగోని యాదగిరి, ప్రతాపగిరి రవికుమార్, నారాబోయిన శ్రీనివాస్, పండుగ బద్రి, మోడం కుమార స్వామి, కోరకొప్పుల మహేందర్, పర్శ రాజు, కుసుమ రమేష్, దామెర శ్రీను, కాసర్ల తిరుమలేష్, మారపాక వెంకటస్వామి, జక్కుల శివ, అక్కెనపల్లి మహేందర్, పిల్లిగల రాజు, ఎడమ నాగరాజు, కుంభోజు శ్రీకాంత్, గంగుల మధుకర్ రెడ్డి, జంగ సురేందర్ రెడ్డి, నారబోయిన రవిలను అభివృద్ధి కమిటీలో చేర్చారు.

## ప్రమాదాల నివారణపై దృష్టి

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారుల గల రఘునాథపల్లి, నిడిగొండ, గోవర్ధనగిరి, కొమ్మల గ్రామాల మధ్యలో ఇటీవల తరచుగా ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో రఘునాథపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇటీవల మొబైల్ టిఫిన్ సెంటర్‌పై బస్సు దూసుకెళ్లడంలో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే.. ఈ క్రమమంలో పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



**జిల్లా ఎన్నికల అధికారి,**

**కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా:** ఈ నెల 27న జరుగనున్న ఖమ్మం నల్గొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ఏర్పాట్లను చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై అదనపు రాష్ట్ర ఎన్నికల అధికారులు సర్ఫరాజ్, లోకేష్ కుమార్ లతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 23,419 మంది ఉన్నారని, పురుష ఓటర్లు 14,915 మంది ఉండగా, మహిళా ఓటర్లు 8,503 మంది, ఇతరులు ఒకటిగా ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 27న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు గాను జనగామ, ఘనపూర్ (స్టేషన్) డివిజన్ ల పరిధిలో 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ర్యాంపు, విద్యుత్, ఫర్నీచర్లతో పాటు తాగునీరు, వైద్య శిబిరం, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఓటర్లకు తెలిపామన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓలు దేవరాయి కొమరయ్య, డీఎస్. వెంకన్న, జిల్లా నోడల్ అధికారులు నరేంద్ర, ఈ.డి.ఎం. దుర్గారావు, ఎన్నికల విభాగం అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

# 'దేవర' నా అదృష్టం

- మూవీలో తన పాత్ర గురించి వివరించిన జాన్వీ

**మన చౌరాస్తా, సినిమా :** యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ మూవీ 'దేవర'. ఈ మూవీలో తారక్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంతోనే టాలీవుడ్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వబోతుంది ఈ బ్యూటీ. తాజాగా తన మరో కొత్త చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'దేవర' పాత్ర గురించి చెప్పుకొచ్చింది. దేవర మూవీ భిన్నమైన కథ. ఎంతో అందంగా ప్రత్యేకంగా ఉంటుందని తెలిపింది. ఈ చిత్రంలో నటించే అవకాశం రావడం తమ అదృష్టంగా భావిస్తున్నానని చెప్పింది. ఇంత మంచి సినిమా యాక్ట్ చేసే ఛాన్స్ ఇచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపింది జాన్వీ. ఇందులో తంగం అనే పాత్ర చేస్తున్నానని.. ఎంతో వినోదాత్మకంగా ఉంటుందని తెలిపింది. ఇప్పటి వరకు సాగిన చిత్రీకరణ చాలా సరదాగా సాగింది. మూవీ టీమ్ అంకిత భావం చూసి ఆశ్చర్యపోయానని, సెట్లో ఉన్న వారంతా నాతో ఎంతో ప్రేమగా ఉంటారని చెప్పింది దేవర హీరోయిన్. ఇక ఆమె నటించిన 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' మే 31న రిలీజ్ కానుంది. దీంతో పాటు జాన్వీ కపూర్ చేతిలో మరిన్ని ప్రాజెక్టు ఉన్నాయి. 'ఉలజ్', 'సన్నీ సంస్కారీ కీ తుల్సీ కుమారీ' ఉన్నాయి.

